తెలంగాణ రాకుంటే రేవంత్‌రెడ్డి సీఎం అయ్యేవారా?

- మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్

ప్రజాశక్తి –హైదరాబాద్ బ్యూరో

సీఎం రేవంత్‌రెడ్డి భాష చూస్తే అసహ్యంగా ఉందని మాజీమంత్రి వి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య, నీలం సంజీవరెడ్డి, మర్రి చెన్నారెడ్డి, ఎన్టీఆర్, కేసీఆర్ వంటి వాళ్లు తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖులుగా ఉన్నారని, అందరికీ ఆదర్శంగా నిలిచారని చెప్పారు. కేసీఆర్ తెలంగాణ తేకుంటే రేవంత్‌రెడ్డి సీఎం అయ్యేవారా?అని ప్రశ్నించారు. జైపాల్‌రెడ్డి ఇంగ్లీష్‌లో మాట్లాడితే పదాలకు అర్థం కోసం డిక్షనరీలో వెతుక్కునే వారని గుర్తు చేశారు. రేవంత్‌రెడ్డి తెలుగులో మాట్లాడే బూతుల పదాలను ఏ డిక్షనరీలో వెతకాలని ఎద్దేవా చేశారు. నాలుగు వేల గ్రామాల్లో బీఆర్ఎస్ సర్పంచ్‌లు గెలిచారని చెప్పారు. బీఆర్ఎస్ ఎలా ఖతం అవుతుందని ప్రశ్నించారు. భూమి ఉన్నంత వరకు బీఆర్ఎస్ ఉంటుందని, కేసీఆర్ సీఎం కావడం ఖాయమని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ కలిసి పాలమూరు–రంగారెడ్డికి జాతీయ హోదా తేవాలని డిమాండ్ చేశారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఆవేశం, ఆక్రోశం బయటపడుతుందన్నారు. కేసీఆర్‌ను తిట్టడానికి రేవంత్‌రెడ్డికి ప్రజలు ఓట్లు వేశారా?అని ప్రశ్నించారు. ఇందిరమ్మ రాజ్యం అంటే ఇదేనా?అని అడిగారు. రేవంత్‌ను సీఎం కుర్చీ నుంచి దింపిన తర్వాత కేసీఆర్ అసెంబ్లీకి వస్తారని చెప్పారు. ప్రజలకు సీఎం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ రేవంత్‌రెడ్డికి దమ్ముంటే కొడంగల్ నియోజకవర్గంలో ఏ గ్రామంలో అయినా గ్యారంటీలు అమలయ్యాయో చూపించాలని కోరారు. ఇది నిరూపిస్తే తాను ఎన్నికల్లో పోటీ చేయబోనని, రేవంత్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎమ్మెల్యేను చేస్తామని చెప్పారు. ఆయన్ను చూసి ప్రజలు సిగ్గుపడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జి జైపాల్‌యాదవ్, శాట్స్ మాజీ చైర్మెన్ ఆంజనేయగౌడ్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కెసిఆర్ పై రేవంత్‌రెడ్డి విమర్శలు సరికాదు

- మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, చిరుమర్తి లింగయ్య

హైదరాబాద్ బ్యూరో : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను విమర్శించే స్థాయి రేవంత్‌రెడ్డికి లేదని మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, చిరుమర్తి లింగయ్య అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి సీఎం కావడం దౌర్భాగ్యమని అన్నారు. ఆయన భాషను చూసి చిన్న పిల్లలు భయపడుతున్నారని చెప్పారు. పాన్‌షాప్ దగ్గర గుట్కా తినేటోడి కంటే ఘోరంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నారని అన్నారు. కేసీఆర్ గురించి నీచమైన భాష మాట్లాడటం సరైంది కాదన్నారు. మస్తాన్ మటన్ షాప్ దగ్గర కేసీఆర్‌కు ఉద్యోగం ఇస్తానంటూ అహంకారంతో మాట్లాడటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కేసీఆర్ కాలిగోటికి రేవంత్‌రెడ్డి సరిపోడని అన్నారు. ఉద్యమకారుడు హరీశ్‌రావు గురించి మాట్లాడే స్థాయి సీఎంకు లేదన్నారు. కేటీఆర్ తెలంగాణ హీరో అని చెప్పారు. కేటీఆర్ ఆంధ్రలో చదువుకుంటే తప్పేముందని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి బిడ్డను ఆంధ్ర వ్యక్తికే ఎందుకిచ్చారని అడిగారు. రేవంత్‌రెడ్డి భాష మార్చుకోవాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రెస్‌మీట్ పెట్టగానే రేవంత్‌రెడ్డికి తడిసిపోయిందన్నారు. పిట్టలదొర కంటే హీనంగా ఆయన మాట్లాడుతున్నారని చెప్పారు. ఎస్సీ,ఎస్టీ కమిషన్ మాజీ చైర్మెన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి బూతులతో పోటీ పడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అభివృద్ధి కుంటుపడిందన్నారు. నల్లమల బిడ్డ అని చెప్పుకునే రేవంత్‌రెడ్డి పాలమూరు జిల్లాకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని, కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు.



పాల ట్యాంకర్‌ను అడ్డుకున్న పాడి రైతులు

- నార్మల్ మదర్ డెయిరీ చైర్మన్, బోర్డ్ డైరెక్టర్లు రాజీనామా చేయాలని డిమాండ్

ప్రజాశక్తి –హైదరాబాద్ బ్యూరో

పాల బిల్లుల చెల్లింపుల విషయంలో పూర్తిగా విఫలమైన నార్మల్ మదర్ డెయిరీ చైర్మన్, బోర్డు డైరెక్టర్లు వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ.. గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలోని పాలశీతలీకరణ కేంద్రం వద్ద పాల సంఘాల చైర్మన్‌లు, పాడి రైతులు నిరసన కార్యక్రమం చేపట్టారు. మదర్ డెయిరీ వద్ద పాల ట్యాంకర్‌ను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పాల సంఘాల చైర్మన్లు పసుల సతీష్‌రెడ్డి, పెద్దిరెడ్డి భాస్కర్ రెడ్డి, మైదం రంగయ్య మాట్లాడుతూ.. 9 నెలల పాల బిల్లులను వెంటనే రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాల బిల్లులు ఆపితే రైతు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. పాల బిల్లుల చెల్లింపులో పూర్తిగా విఫలమైన మదర్ డెయిరీ చైర్మన్ గుడిపాటి మధుసూదన్‌రెడ్డి, ఎండి, బోర్డు డైరెక్టర్స్ బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

సంఘీభావం తెలిపిన సిపిఎం, ఇతర పార్టీల నాయకులు

పాడి రైతుల ధర్నాకు ఆవాజ్ జిల్లా అధ్యక్షులు, సిపిఎం జిల్లా నాయకులు ఎంఎ ఇగ్బాల్, బిజెపి జిల్లా కార్యదర్శి కమిటీ కృష్ణ, ఆలేరు పట్టణ అధ్యక్షులు నంద గంగేష్ సంఘీభావం తెలిపారు. పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించకపోతే రైతులతో కలిసి ఉద్యమాలకు దిగుతామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు జోక్యం చేసుకొని యాదగిరిగుట్ట దేవస్థానం నెయ్యి కాంట్రాక్టు వెంటనే తిరిగి మదర్ డెయిరీకి అప్పగించాలని డిమాండ్ చేశారు. సోమవారంలోగా పాడి రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మదర్ డెయిరీ ఎండి మొబైల్ ఫోన్ ద్వారా వివరణ ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల సంఘాల చైర్మన్లు పెద్దిరెడ్డి భాస్కర్ రెడ్డి, తీపి రెడ్డి సత్యనారాయణ రెడ్డి, ఉదరి రాములు, మోటే శ్రీశైలం, మోటే శంకర్, పారెల్లి కృష్ణ, పారేల్లి సత్యనారాయణ, దడిగే రాములు, టంగుటూరు చంద్రయ్య, చీర బోయిన రాజయ్య పాల్గొన్నారు.



వివాహితున్ని ప్రేమించిన కూతురు

- పరువు పోతుందని హత్య చేసిన తల్లిదండ్రులు
- పోలీసుల విచారణతో వెలుగులోకి..
- కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలో దారుణ ఘటన

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

కూతురు ఓ వివాహితుడిని ప్రేమిస్తుందని తెలుసుకున్న తల్లిదండ్రులు.. పలుమార్లు మందలించినా మారకపోవడంతో.. ఈ విషయం బయట తెలిస్తే పరువు పోతుందనుకుని కన్న కూతురిని కర్కశంగా హత్య చేశారు. ఆ తర్వాత ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు. పోలీసుల విచారణతో అసలు విషయం ఆలస్యంగా వెలుగుజూసింది. ఈ దారుణ ఘటన కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని సర్వాయిపేట గ్రామ పరిధిలోని శివరాంపల్లిల్లో జరిగింది. సైదాపూర్ పోలీసు స్టేషన్‌లో గురువారం హుజురాబాద్ ఎసిపి మాధవి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. శివరాంపల్లికి చెందిన రెడ్డి రాజు, రెడ్డి లావణ్య దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. చిన్న కుమార్తె (16) అదే గ్రామానికి చెందిన ఓ వివాహితుడిని ప్రేమిస్తుందని తెలుసుకున్న తల్లిదండ్రులు పలుమార్లు మందలించారు. అయినా తీరు మారకపోవడంతో నవంబర్ 14వ తేదీన బాలికకు బలవంతంగా పురుగుల మందు తాగించారు. ఆ తర్వాత గొంతు నులిమి హత్య చేశారు. తరువాత తమ కూతురు కడుపు నొప్పి భరించలేక పురుగుల మందు తాగి చనిపోయిందని తల్లిదండ్రులు సైదాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించి వారు చెప్పిన విషయాలు పొంతన లేకపోవడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేశారు. ఫోరెన్సిక్ హత్యగా గుర్తించిన పోలీసులు తల్లిదండ్రులను విచారించారు. ప్రేమ వ్యవహారం బయటికి వస్తే పరువుపోతుందని హత్య చేసినట్టు ఒప్పుకున్నారు. దీంతో వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నామని ఎసిపి మాధవి తెలిపారు. సమావేశంలో హుజురాబాద్ రూరల్ సిఐ పులి వెంకటేష్, సైదాపూర్ ఎస్ఐ తిరుపతి ఉన్నారు.

ఫోన్ ట్యాపింగ్ వెనుక బిఆర్ఎస్

- ప్రభాకర్‌రావు పెన్‌డ్రైవ్ నుంచే ఆధారాలు సేకరించిన సిట్
- ముగిసిన 14 రోజుల పోలీసు కస్టడీ

ప్రజాశక్తి – హైదరాబాద్



రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం గురువారం కీలక దశకు చేరుకున్నది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఈ కేసులో ప్రధాన నిందితుడైన ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావును 14 రోజుల పాటు విచారించిన సిట్ అధికారులు అనేక కీలక ఆధారాలను సేకరించారు. గురువారం చివరి రోజు కాగా...ఆయనతో పాటు ఈ కేసులో ఇప్పటికే అరెస్టు అయిన బెయిల్‌పై ఉన్న ఎస్ఐబీ డీఎస్పీ ప్రవీణ్‌రావు, నగర్ టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు, అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతయ్య, ఒక మీడియా ఛానల్ యజమాని శ్రవణ్‌కుమార్‌లను కలిపి జూబ్లీహిల్స్‌లోని సిట్ కార్యాలయంలో అధికారులు 10 గంటలకుపైగా విచారించారు. అంతకు ముందు ఫోన్ ట్యాపింగ్ జరిపే విషయంపై ప్రభాకర్‌రావు తనకు ఇచ్చిన ఆదేశాల గురించి మరోసారి పై నలుగురు అధికారులను మరోసారి సిట్ అధికారులు విచారించారు. ఆ సమయంలో ప్రభాకర్‌రావును ఎదుటగానే ఉంచుకుని వారిపై ప్రశ్నల వర్షం కురిపించారు. మధ్యలో వారు చెబుతున్న అంశాలపై ప్రభాకర్‌రావును క్రాస్ ఇంటరాగేషన్ చేసి కొన్ని కీలక వివరాలను రాబట్టినట్టు తెలిసింది. ఆ సమయంలో సైతం ప్రభాకర్‌రావు కొన్ని ప్రశ్నలకు నో అంటూ సమాధానం ఇచ్చాడని తెలిసింది. కాగా, ఆయన నో అన్నప్పటికీ ఆయన కింద పనిచేసిన పై నలుగురు అధికారులు ఇచ్చిన సమాచారంలో ఉన్న నిజాలను దర్యాప్తు అధికారులు గట్టిగా విశ్వసిస్తూ దానికి సంబంధించిన ఆధారాలను సైతం సేకరించినట్టు తెలిసింది. మొత్తం మీద ఈ కీలక విచారణలో ఫోన్ ట్యాపింగ్ జరిగిన వ్యవహారం, జరిపించింది ఎవరు? వారి నేరాన్ని రుజువు చేసే ఆధారాలను సిట్ అధికారులు సమగ్రంగా సేకరించినట్టు తెలిసింది. శుక్రవారంతో ప్రభాకర్‌రావు కస్టడీకి సంబంధించి సుప్రీం కోర్టు ఇచ్చిన గడువు పూర్తికానుండటంతో ఆయనను విడుదల చేయడానికి అవసరమైన చర్యలను కూడా సిట్ అధికారులు తీసుకుంటున్నట్టు తెలిసింది. కాగా, ప్రభాకర్‌రావుకు సంబంధించిన పెన్‌డ్రైవ్ నుంచి ఫోన్ ట్యాపింగ్ చేశారనడానికి కీలకమైన ఆధారాలను అధికారులు విశ్లేషించి సేకరించారని సమాచారం. బీఆర్ఎస్‌కు చెందిన ప్రముఖ నేతల పాత్రను కూడా గుర్తించినట్టు తెలిసింది. ఈ విచారణలో సిట్ సభ్యులు అంబర్‌కిశోర్ ఝా, విజయ్‌కుమార్, రితురాజ్, నారాయణరెడ్డి, శ్రీధర్, వెంకటగిరి తదితరులు పాల్గొన్నారు.

ప్రభాకర్‌రావు కుమారుడిని విచారించిన సిట్

ఇదిలా ఉంటే, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు కుమారుడు నిశాంత్‌రావును సిట్ అధికారులు గురువారం నాలుగు గంటల పాటు విచారించారు. నిశాంత్‌రావు చేసే వ్యాపారాలు, ఇతర ఆర్థిక లావాదేవీల గురించి ఆరా తీసినట్టు తెలిసింది. ముఖ్యంగా, అతని బ్యాంక్ స్టేట్‌మెంట్లను ముందు ఉంచుకుని అందులో తమకు ఉన్న అనుమానాలను నిశాంత్ రావు ద్వారా నివృత్తి చేసుకునే ప్రయత్నాన్ని సిట్ అధికారులు చేశారు.

మాజీ సీఎస్, డీజీపీలను విచారించిన సిట్ అధిపతి సజ్జనార్

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో విచారణను చరమాంకానికి చేర్చుతూ సిట్ అధిపతి, నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ గురువారం రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ డీజీపీలను విచారించినట్టు తెలిసింది. బంజారాహిల్స్‌లో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ కార్యాలయంలోని తన ఛాంబర్‌కు మాజీ సీఎస్ సోమేశ్‌కుమార్, మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డిలను సజ్జనార్ పిలిపించి విచారణ జరిపినట్టు తెలిసింది. ముఖ్యంగా పదవీ విరమణ చేసిన ప్రభాకర్‌రావును అత్యంత కీలకమైన ఎస్ఐబీ ఓఎస్‌డీగా నియమించడానికి గల కారణాలను సోమేశ్‌కుమార్, మహేందర్‌రెడ్డి నుంచి తెలుసుకునే ప్రయత్నం చేశారని తెలిసింది. సాధారణంగా పదవీ విరమణ చేసిన అధికారులను ఎస్ఐబీ వంటి విభాగానికి ఇన్‌చార్జిగా నియమించడం ఎంత వరకు సబబు అంటూ కూడా ఆయన సమాధానాలను రాబట్టే ప్రయత్నం చేశారని తెలుస్తోంది. కాగా, ఈ పూర్తి విచారణలో ఆ సమయంలో ఏ నిర్ణయం జరిగినా ప్రభుత్వ ఆదేశాల మేరకే అని మాజీ అధికారులు తెలిపినట్టు విశ్వసనీయంగా తెలిసింది. కాగా, ప్రభాకర్‌రావు హయాంలో ఎస్ఐబీ జరిపిన ఫోన్ ట్యాపింగ్‌లలో చాలా వరకు మావోయిస్టులకు సబంధించిన నెంబర్లు అని రివ్యూ కమిటీకి సిఫారసు చేసినట్టు కూడా అధికారులు చెప్పినట్టు తెలిసింది

ప్రజలకు కెటిఆర్ క్రిస్మస్ శుభాకాంక్షలు

హైదరాబాద్ బ్యూరో : రాష్ట్ర ప్రజలందరికీ ముఖ్యంగా క్రైస్తవ సోదర, సోదరీమణులకు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారక రామారావు క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కరుణ, ప్రేమ, శాంతిని బోధించిన ఏసుక్రీస్తు జన్మదినం ప్రపంచానికే ఒక పండుగ అని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ ప్రభువు ఆశీస్సులు ప్రతి ఇంట్లో ఉండాలనీ, అందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆరోగ్యం వెల్లివిరియాలని కోరారు. ఈ పండుగ అందరి మధ్య సోదరభావాన్ని, సామరస్యాన్ని మరింత పటిష్టం చేయాలని ఆకాంక్షించారు.

సిఎంను కలిసిన కొండారెడ్డి పల్లి సర్పంచ్

హైదరాబాద్ బ్యూరో : ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని కొండారెడ్డిపల్లి సర్పంచ్ మల్లెపాకుల వెంకటయ్యతో పాటు వార్డు సభ్యులు గురువారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. సీఎం సొంత గ్రామమైన కొండారెడ్డి పల్లిలో మొదటి విడతలో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ క్రమంలో సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులను సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు.

అసమానతలను స్థిరపర్చడమే ఆర్ఎస్ఎస్, బిజెపి సిద్ధాంతం

- మానవత్వ సమజం కోసం యువతరం పోరాడాలి
- కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. స్కైలాబ్ బాబు



మనుస్మృతి పత్రాలను దహనం చేస్తున్న స్కైలాబ్ బాబు

ప్రజాశక్తి –హైదరాబాద్ బ్యూరో

మనుషుల మధ్య అసమానతలను స్థిరపర్చడమే ఆర్ఎస్ఎస్– బిజెపి విధానమని, రాజ్యాంగాన్ని వ్యతిరేకిస్తూ మనుస్మృతిని తీసుకురావాలని అవి ప్రయత్నం చేస్తున్నాయని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. స్కైలాబ్‌బాబు అన్నారు. మనువాదానికి వ్యతిరేకంగా సామాజిక సమానత్వం కోసం యువత పోరాడాలని పిలుపునిచ్చారు. "మనుధర్మం వద్దు, భారత రాజ్యాంగం ముద్దు" అంటూ గురువారం రాష్ట్రవ్యాప్తంగా కేవీపీఎస్ ఆధ్వర్యంలో మనుస్మృతి పత్రాలను దహనం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మనుస్మృతి పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా స్కైలాబ్ బాబు మాట్లాడుతూ.. మనుస్మృతిని మట్టుపెట్టకపోతే మరో వెయ్యేండ్లయినా దేశ ప్రజల మధ్య ఐక్యత అసాధ్యమని అన్నారు. ఆర్ఎస్ఎస్–బీజేపీ విధానాల వల్ల దేశంలో అసమానతలు పెరుగుతున్నాయని తెలిపారు. ప్రపంచంలో ఎక్కడా లేని కుల వ్యవస్థను అడ్డం పెట్టుకొని దేశంలో సామాజిక అసమానతలను సృష్టించి, వివక్షతలకు ఆర్ఎస్ఎస్–బీజేపీ కారణమవుతున్నాయని అన్నారు. ఆశాస్త్రీయమైన మనుధర్మ శాస్త్రాన్ని ప్రజలు మట్టిలోనే పాతరేయాలని పిలుపునిస్తూ 1927 డిసెంబర్ 25న అంబేద్కర్ మను ధర్మ శాస్త్రాన్ని మహారాష్ట్రలోని రాయగడ్ జిల్లాలో వేలాది మందితో కలిసి దహనం చేశారని గుర్తుచేశారు. గోవాల్కర్ నుంచి నేటి మోహన్ భగవత్ దాకా.. శ్యాంప్రసాద్ ముఖర్జీ నుంచి నేటి మోడీ వరకు.. ఎవరు, ఎప్పుడు, ఎక్కడ మాట్లాడినా మనధర్మం అంటూ మాట్లాడుతున్నారన్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎం. కురుమయ్య, జిల్లా ఉపాధ్యక్షులు జి. లక్ష్మీదేవి, పి. నాగరాజు, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు కె. ప్రశాంత్, వి. భరత్, కెవిపిఎస్ నాయకులు రాజు, శ్రీను, నవాబ్ తదితరులు పాల్గొన్నారు.

వికారాబాద్ జిల్లా తాండూరులోని అంబేద్కర్ విగ్రహం ఎదుట సామాజిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మనుస్మృతి ప్రతులను దహనం చేసి దానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బొంరాస్‌పేట మండలం కొత్తూరు గ్రామంలో మహనీయుల విగ్రహాల ఎదుట మనుస్మృతి శాసనాలను తగలబెట్టారు. నల్లగొండలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట మనుధర్మ శాస్త్ర ప్రతులను దహనం చేశారు. పెద్దపల్లిలో అంబేద్కర్ విగ్రహం మనుస్మృతి ప్రతులను దహనం చేస్తున్న క్రమంలో పోలీసులు అడ్డుకున్నారు. ఆదిలాబాద్‌లోని స్థానిక బాశెట్టి మాధవరావు స్మారక కేంద్రం ఎదుట మనుధర్మ శాస్త్ర ప్రతులను దహనం చేశారు. హనుమకొండలోని అంబేద్కర్ సెంటర్‌లో, మహబూబాబాద్‌లో మనుస్మృతి ప్రతులను దహనం చేశారు.

రేవంత్.. నీది కెసిఆర్ స్థాయి కాదు

- ముఖ్యమంత్రి హోదాను మరింత దిగజార్చుతున్నావ్
- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి తీవ్ర విమర్శలు

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో



మీడియాతో మాట్లాడుతున్న జగదీశ్ రెడ్డి

'రేవంత్.. నీది కేసీఆర్ స్థాయి కాదు.. నువ్వు గల్లీ స్థాయి నాయకుడివని మరోసారి రుజువైంది.. ముఖ్యమంత్రి హోదాను రోజురోజుకూ దిగజారుస్తున్నావు.. కెసిఆర్ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేకనే విషంకక్కుతున్నావు. మురుగుకాలువకన్నా అధ్వానంగా నీ నోరు ఉంది. రండలు మాట్లాడే భాషను సిఎం మాట్లాడటం సిగ్గుచేటు' అని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ద్వారా రేవంత్‌రెడ్డి తన రాజకీయ స్థాయిని మరోసారి బయట పెట్టుకున్నారని విమర్శించారు. 'నువ్వెంత దిగజారినా మేము ఆ స్థాయికి దిగజారం.. రెండేండ్ల పాలనలో ఒక్కసారి కూడా కేసీఆర్ నీ పేరు ఎత్తలేదు.. కానీ నువ్వు మాత్రం రోజూ కసీఆర్ పేరే జపిస్తున్నావు.. పోలీసులు, అధికారులు, మీ గూండాలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అందరూ కలిసి సర్పంచ్ ఎన్నికల్లో పనిచేసినా ప్రజలు బీఆర్ఎస్ పక్షాన నిలబడి అద్భుతమైన ఫలితాలు అందించారు' అని అన్నారు. మంచి పనులు చేసి.. మంచి మాటలతో ప్రజా హృదయాలను గెలవాలి కానీ, రేవంత్ మాటలు విని సర్పంచులే సిగ్గుపడుతున్నారని అన్నారు. సాధారణ ఎన్నికలు ఎప్పుడొచ్చినా రేవంత్‌ను రాజకీయంగా ప్రజలే బండరాళ్లు కట్టి మూసీలో పడేస్తారని అన్నారు. తెలంగాణకు అన్యాయం జరిగితే తాము మౌనంగా కూర్చోమని.. తెలంగాణ తెచ్చిన పార్టీగా, ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల పక్షాన కొట్లాడటం తమ బాధ్యత అన్నారు. ప్రభుత్వం ఇంకా కండ్లు తెరవకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమం తప్పక ప్రారంభిస్తామని హెచ్చరించారు.



యూరియా కోసం రైతన్న కష్టాలు

ప్రజాశక్తి –హైదరాబాద్ బ్యూరో

రోజురోజుకూ యూరియా కొరత కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. యూరియా వచ్చిందని తెలిస్తే చాలు వ్యవసాయ పనులు విడిచి రోజంతా భోజనం చేయకుండా వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ పట్టణకేంద్రంలోని శివునిపల్లిలో ఓ ఎరువుల దుకాణంలో యూరియా రావడంతో గురువారం మండలంలోని రైతులు భారీగా తరలివచ్చారు. ఉదయం నుంచి క్యూలో ఉన్న రైతులు నిరసంతో నిలబడలేక అసహనం వ్యక్తం చేశారు. "యాప్ ద్వారా నమోదు చేసుకున్నాం.. ఈరోజు యూరియా బస్తాలు తీసుకోకపోతే ఎలాగా.. ఈ పాడు ప్రభుత్వాలు రైతులను అరిగోస పెడుతున్నాయి" అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా బస్తాలు తీసుకెళ్దామని వస్తే, ఎరువుల దుకాణం యాజమానులు ఒక ఎరువు బస్తాకు అదనంగా ఏదైనా కొనుగోలు చేస్తేనే ఇస్తామని రైతులని ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని, లేదంటే జాతీయ రహదారిపై ఆందోళన చేపడతామని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఏజెన్సీల్లో గజగజ

- కనిష్టానికి పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- ఉదయం కమ్ముకుంటున్న పొగ మంచు
- ఉమ్మడి ఆదిలాబాద్‌లో 7.7 కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు
- ఎనిమిది జిల్లాల్లో సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో ఉష్ణోగ్రతలు కనిష్టానికి పడిపోతున్నాయి. చాలా జిల్లాల్లో చలి పంజా విసురుతోంది. ఎనిమిది జిల్లాల్లో ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోగా.. మరో 20 జిల్లాల్లో 14 డిగ్రీల లోపల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్, ఆసిఫాబాద్ ఏజెన్సీ గ్రామాలు చలికి గజ గజ వణికిపోతున్నాయి. 10 రోజులుగా గిరిజనులు చలి తీవ్రతను తట్టుకోలేకపోతున్నారు. చలికాలంలో సాధారణంగా 10 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కానీ గత పది రోజులుగా కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోతూ వస్తున్నాయి. దీంతో ఉదయం 10 గంటలైనా పొగ మంచు కమ్మేసుకునే ఉంటోంది. హైదరాబాద్ నగర శివారు ప్రాంతాలతోపాటు సంగారెడ్డి, రంగారెడ్డి జిల్లాల్లోనూ చలి తీవ్రత ఎక్కువగా ఉంది.

బుధవారం ఆదిలాబాద్ జిల్లాలో 7.7 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో ప్రభుత్వం పాఠశాలల సమయాలను మార్చాల్సి వచ్చింది. ఉదయం 9:45 గంటల నుంచి పాఠశాలలు తెరవాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. తీవ్ర చలి నేపథ్యంలో ప్రజలు ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్య శాఖ అధికారులు అవగాహనా కార్యక్రమాలు చేపడుతున్నారు. పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

ఈశాన్యం నుంచి శీతల పవనాలు

దక్కన్ పీఠ భూమికి ఎత్తైన ప్రాంతం కావడంతో హిమాలయాల నుంచి వీచే శీతల పవనాలు మొదటగా



ఆదిలాబాద్‌ను తాకుతాయి. దీంతో నవంబర్, డిసెంబర్ నెలల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఎండాకాలంలో పగటి పూట నమోదయ్యే 44 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో పెరగడం, శీతాకాలంలో కనిష్ఠ స్థాయికి ఉష్ణోగ్రతలు పడిపోవడంతో వృద్ధులు, చిన్నారుల ఆరోగ్య పరిస్థితి తీవ్రంగా దెబ్బతింటోంది. రోజంతా చల్లటి వాతావరణం ఉండటంతో వృద్ధులు శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బంది పడుతున్నారు.

కష్ట జీవుల ఇబ్బందులు

చలి తీవ్రత అధికమవ్వడంతో కష్టజీవులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం పూట ఎముకలు కొరికే చలితో పాలు అమ్మేవారు, పేపర్ బాయ్‌లు, కూరగాయలు అమ్మేవారు, టీ క్యాంటీన్లు నడిపేవారు వణికిపోతున్నారు. చలి తీవ్రతను తట్టుకోలేక ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులను పాఠశాల ఆవరణలో కూర్చోబెట్టి పాఠాలు బోధిస్తున్నారు.

జాగ్రత్తలు పాటించాలి: వైద్యుల సూచన

కనిష్ట స్థాయికి పడిపోతున్న ఉష్ణోగ్రతలతో చిన్నారులు, వృద్ధులు, ఆస్తమా రోగులు జాగ్రత్తలు పాటించాలని ఆదిలాబాద్ జిల్లా ఆరోగ్య శాఖ అధికారులు, పలువురు వైద్యులు సూచిస్తున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న చలిని తట్టుకునేందుకు శరీరంలో వేడి పుట్టించే ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచిస్తున్నారు. వృద్ధులు తప్పనిసరిగా నూలు దుస్తులు ధరించడంతో పాటు చెవులను, ముక్కును కప్పి ఉంచేలా జాగ్రత్తలు పాటించాలంటున్నారు. చిన్నారులకూ చలిగాలి తగలకుండా చూడాలని, జలుబు వేసిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు. ఆస్తమా రోగులు తప్పనిసరిగా ఉదయం పూట వ్యాయామంతో పాటు వేడి ఆహారం తీసుకోవాలని సూచిస్తున్నారు.

హైదరాబాద్ బుక్ ఫెయిర్ జనంతో కిటకిటలాడింది. హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ఎన్‌టిఆర్ స్టేడియం (తెలంగాణ కళాభారతి)లో ఈనెల 19న పుస్తక ప్రదర్శన ప్రారంభమైన విషయం తెలిసిందే. గురువారం క్రిస్మస్ సెలవు దినం కావడంతో పుస్తక ప్రియులు భారీగా తరలొచ్చారు.

కబంధ'హస్తా'ల్లోకి 'సహకారం'!

- ఎన్నికల రద్దు యోచనపై విపక్షాల ఆగ్రహం
- నామినేటెడ్ భర్తీతో తీరని నష్టం
- సాగు తెలియకున్నా పాలనా బాధ్యతలకు ఛాన్స్
- నేటి నుంచి పిఏసిఎస్‌ల ఎదుట తెలంగాణ రైతుసంఘం నిరసన



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"సహకార సంఘాల ఎన్నికలను ప్రభుత్వం రద్దు చేయాలనే యోచనతో పాలన సమస్యాత్మకంగా మారనుందని విపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. సాగు తెలియని అధికారులు, నాయకుల 'చేతి'లో రైతుకు 'సహకారం' లోపించే ప్రమాదం ఉందని తెలంగాణ రైతుసంఘం అంటోంది. నేటి నుంచి పిఎసిఎస్, డిసిసిబిల ఎదుట రైతాంగం ఆందోళనలకు సమాయత్తం అయింది."

రాష్ట్రంలోని సహకార సంఘాలకు ఎన్నికలు రద్దు చేయాలనే యోచనపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పిఏసిఎస్), జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల (డిసిసిబి) పాలకవర్గాలను ఇటీవల రద్దు చేసింది. ఎన్నికలు నిర్వహించకుండా నామినేటెడ్ పద్ధతిలో పాలకమండళ్లను నియమించాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఏకపక్ష పాలనకు అవకాశం ఏర్పడుతుందని, ఇది రైతాంగానికి తీరని నష్టం చేస్తుందని తెలంగాణ రైతుసంఘం అభిప్రాయపడుతోంది. ఆంధ్రప్రదేశ్ తరహాలో ఒక్కో పిఏసిఎస్‌కు ఒక్కో చైర్మన్, ఇద్దరు సభ్యులతో కూడిన త్రిసభ్య కమిటీలు (పర్సన్స్-ఇన్-చార్జ్) నియమించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. కొత్త జిల్లాలు, మండలాల పునర్వ్యవస్థీకరణ, ఎన్నికల వ్యయం తగ్గుతుందనే కారణాలను ప్రభుత్వం చూపుతున్నా.. రాజకీయ పట్టుకోసం కాంగ్రెస్ కుయుక్తులు పన్నుతున్నదని విపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

వెంటాడిన యూరియా భయం?

వానాకాలంలో ఏర్పడిన యూరియా కొరత.. ఇప్పుడు యాప్ దాకా వచ్చింది. రైతుల్లో చాలామంది నిరక్షరాస్యులు కావటంతో యాప్‌ను అర్థం చేసుకోవటం రైతులకు సమస్యగా మారింది. ఇది కూడా ప్రభుత్వం సహకార ఎన్నికలు రద్దు చేయటానికి కారణమై ఉండొచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇక విత్తనాలు, ఎరువులు.. ఇలా అనేకం పిఏసిఎస్‌ల నుంచే పంపిణీ అవుతుంటాయి. వీటి నిర్వహణ పాలకమండళ్లు ఉన్న సమయంలోనే కష్టమైంది. అటువంటిది త్రిసభ్య కమిటీ రైతులకు ఏమేరకు న్యాయం చేస్తుందనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రైతు వ్యతిరేకత ఉన్న ప్రస్తుత తరుణంలో సహకార ఎన్నికలకు పోతే అధికార పక్షానికి ప్రతికూల ఫలితాలు వస్తాయనే కారణంతోనే నామినేటెడ్‌కు వెళ్లిందని విపక్షాల నేతలు విమర్శిస్తున్నారు.

ప్రశ్నార్థకంగా కొత్త సొసైటీల ఏర్పాటు

కొత్త జిల్లాల్లో రైతుల సంఖ్యకు అనుగుణంగా సొసైటీలు లేకపోవటంతో ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నూతనంగా ఏర్పడింది. ఈ జిల్లాలో ప్రస్తుతం 21 సంఘాలున్నాయి. వీటిలో 90,249 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. కొన్ని సంఘాల్లో సభ్యులు ఎక్కువగా ఉన్నారు. అందువల్ల కొత్తగా ఎనిమిది సంఘాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు పంపారు. ఇలాంటి తరుణంలో సొసైటీ పాలకవర్గాలను రద్దు చేయటంతో వీటి ఏర్పాటుపైనా సందేహాలు నెలకొన్నాయి. సహకార బ్యాంకు సేవలు మినహా కొత్త జిల్లాలో మిగతా సేవలు అందుబాటులో లేవు. కాబట్టి నూతనంగా ఏర్పడిన జిల్లాల్లో సైతం డిసిసిబి ప్రాంతీయ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని 2024లో నిర్ణయించినా అమలుకు నోచుకోలేదు.

అధికార పార్టీ వారికే అవకాశాలు

నామినేషన్ విధానం అమల్లోకి వస్తే సహకార సంఘాల్లోని అన్ని కీలక పదవులు అధికార పార్టీ వారికే దక్కే అవకాశం ఉంది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 207 వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో 183 కమిటీలకు పాలకవర్గాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వీటిల్లో అధికారపార్టీకి చెందిన దాదాపు 3వేల మందికి పైగా పదవులు దక్కాయి. ఇదే తరహాలో పిఏసిఎస్‌లు, డిసిసిబిలు మార్క్‌ఫెడ్, టెస్కాబ్‌కు కూడా నామినేటెడ్ పాలకవర్గాలను ఏర్పాటు చేస్తే రాష్ట్రవ్యాప్తంగా సుమారు 12వేల మందికి పైగా అధికార పార్టీకి చెందిన వారికి పదవులు దక్కుతాయి.

సంక్రాంతిలోపు ప్రక్రియ పూర్తి..!

వీలైనంత త్వరగా పిఏసిఎస్‌ల పాలకవర్గాలను నియమించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టుగా తెలుస్తోంది. సంక్రాంతి నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేయాలనే యోచనలో ఉన్నట్టు సమాచారం. పిఏసిఎస్‌లకు ఎన్నికలు లేకుండా నామినేటెడ్ పాలక మండళ్లను ఏర్పాటు చేసే అంశంపై త్వరలో అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. నామినేటెడ్ విధానంలోనైనా పిఏసిఎస్‌ల్లో సభ్యులుగా ఉన్న రైతులకే పాలకవర్గాల్లో అవకాశం కల్పించాలనే నిబంధన ప్రభుత్వం పాటించే అవకాశం ఉంది. సభ్యత్వం లేని వారికి పదవులు ఇవ్వకూడదన్న అభిప్రాయంతో ఉన్నా.. అది ఏ మేరకు నెరవేరుతుందనే అనుమానం వ్యక్తమవుతోంది.

సహకార వ్యవస్థను ధ్వంసం చేసే యోచన : బొంతు రాంబాబు, తెలంగాణ రైతుసంఘం ఖమ్మం జిల్లా కార్యదర్శి

సహకార సంఘాల కమిటీలకు కాంగ్రెస్ కార్యకర్తలను నామినేట్ చేయాలనే యోచనను ప్రభుత్వం విరమించుకోవాలి. సహకార వ్యవస్థను ధ్వంసం చేయటానికే ఇటువంటి ప్రయత్నాలు చేస్తున్నారు. దీనివల్ల సహకార సేవల్లో సమతుల్యత లోపించే ప్రమాదం ఉంది. సొసైటీలకు ఎన్నికలు నిర్వహించాలనే డిమాండ్‌తో 26 నుంచి పిఏసిఎస్‌లు, డిసిసిబిల వద్ద నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చాం.

ఇస్రో ఉపగ్రహ ప్రత్యక్ష వీక్షణలో లోటస్ ల్యాప్ స్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి - హైదరాబాద్

దేశంలోనే మొదటి అతిభారీ వాణిజ్య సమాచార ఉపగ్రహమైన ఎల్‌విఎం3-ఎం6 బ్లూబర్డ్ ప్రయోగాన్ని నగరంలోని వనస్థలిపురంలోని లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన 45 మంది విద్యార్థులు ప్రత్యక్షంగా వీక్షించారు. శ్రీహరికోటలోని ఇస్రోకు చెందిన ప్రతిష్ఠాత్మక సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రంలో జరిగిన ఉపగ్రహ లాంచింగ్‌కు సాథీ ఆధ్వర్యంలో 9వ, 10వ తరగతులకు చెందిన 45 మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రయోగాన్ని ప్రత్యక్షంగా వీక్షించిన అనంతరం విద్యార్థులు ఎంతో ఆనందం వ్యక్తం చేశారని సాథీ బృందం తెలిపింది.

వైద్యుల జీతాల సంక్షోభాన్ని పరిష్కరించాలి

- అసెంబ్లీలో వెంటనే బిల్లు పెట్టాలి : టిజిజిడిఎ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టివివిపి) పరిధిలో పనిచేస్తున్న వైద్యులకు జీతాల సమస్యను పరిష్కరించాలనీ, కార్పొరేషన్ వ్యవస్థ నుంచి వారిని డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్(డీఎస్‌హెచ్‌ఎస్) పరిధిలోకి తీసుకొచ్చేలా అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టాలని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం (టిజిజిడిఎ) డిమాండ్ చేసింది. ఈ మేరకు టిజిజిడిఎ అధ్యక్షులు డాక్టర్ బి.నరహరి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ లాలు ప్రసాద్ రాథోడ్, కోశాధికారి డాక్టర్ ఎంకే. రౌఫ్ ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమకు న్యాయం చేస్తుందని రెండేండ్ల నుంచి ఎదురుచూసినా ఫలితం దక్కలేదని వాపోయారు. పైగా, తమ పరిస్థితి దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైద్యులకు ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు వచ్చేలా శాశ్వత వ్యవస్థను ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు. లేనిపక్షంలో తదుపరి కార్యాచరణను ప్రకటిస్తామని హెచ్చరించారు.

అంతరాలు సృష్టించిన మనుస్మృతిని అంతం చేయాలి

- గ్రంథం దహన కార్యక్రమంలో జి రాములు, టి సాగర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మనుషుల మధ్య అసమానతలు సృష్టించిన మనుస్మృతిని మట్టిలో పాతిపెట్టాలని కెవిపిఎస్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు జి రాములు, టి సాగర్ పిలుపునిచ్చారు. కెవిపిఎస్ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద మనుస్మృతి గ్రంథాన్ని దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనుస్మృతి, దాని భావాజాలాన్ని మట్టుపెట్టకపోతే మరో వెయ్యేళ్లయినా ప్రజల మధ్య ఐక్యత అసాధ్యమని స్పష్టం చేశారు ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి విధానాలవల్ల అసమానతలు స్థిరపడుతున్నాయని తెలిపారు. మనుషుల మధ్య అంతరాలకు మూలమైన ఆ భావాజాలాన్ని నాశనం చేయాలనని పేర్కొన్నారు. అసమానతలన స్థిరపరచడానికి చాతుర్వర్ణ వ్యవస్థను సమాజంపై రుద్దిందని విమర్శించారు. ప్రపంచంలో ఎక్కడా లేనీ కుల వ్యవస్థను దోపిడీ సాధనంగా పేదల ఐక్యతకు ఆటంకంగా కొనసాగిస్తుందని చెప్పారు. కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబుతో పాటు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్ వెంకట్ రాములు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్ తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడు శోభన్, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్ టిపిటిఎల్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏ విజయ్, కెవిపిఎస్ నగర నాయకులు తదితరులు పాల్గొన్నారు

నందన్ కుమార్‌ను విచారించిన సిట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఫోన్ ట్యాపింగ్ కేసులో తాజాగా డక్కన్ కిచెన్ యజమాని హోటల్ యజమాని నందకుమార్‌ను సిట్ అధికారులు గురువారం నాలుగు గంటల పాటు విచారించారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఉన్న సమయంలో ఎమ్మెల్యేల కొనుగోళ్లకు సంబంధించి నంద కుమార్‌పై ఆరోపణలు చేసి సైబరాబాద్ పోలీసులు విచారించిన సంగతి తెలిసిందే. కాగా, తన ఫోన్‌ను ఆ సమయంలో ట్యాపింగ్ చేశారంటూ నందకుమార్ ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే సిట్ అధికారులు నందకుమార్‌ను పిలిచి తన ఫోన్లను ట్యాపింగ్ జరిగినట్టు ఎప్పుడు గుర్తించారు? అనే కోణంలో విచారించారు. ముఖ్యంగా తనతో సింహాద్రియాజులు మరికొందరు మాట్లాడిన ఆడియో రికార్డింగ్‌లను ఆ సమయంలో బిఆర్‌ఎస్ నాయకులు విడుదల చేశారనీ, దాంతో తన ఫోన్‌లు ట్యాపింగ్‌కు గురైనట్టు గ్రహించి ఫిర్యాదు కూడా చేసినట్టు తెలిపారు. దీనిపై మరికొన్ని ప్రశ్నలు వేసిన సిట్ అధికారులు నందకుమార్ స్టేట్ మెంట్‌ను రికార్డు చేసి పంపించేశారు.

తల లేని మొండెంగా 'ఉపాధి' కొత్త బిల్లు

- ఉపాధి హామీ చట్టంపై మొదటి నుంచీ మోడీ కక్ష : బి వెంకట్



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మోడీ ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టం 2005ను రద్దు చేసి 2025 పేరుతో 197 బిల్లును తెచ్చిందని, ఈ బిల్లు చట్టమైతే తల లేని మొండెంగా తయారవుతుందని వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గాంధీని చంపిన గాడ్సే వారసులే ఆ పేరుతో ఉన్న ఉపాధి హామీని చంపబోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ సర్కార్ ఉపాధి హామీ చట్టంపై మొదటి నుంచీ కక్షపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని వికసిత్ భారత్ 2047లో భాగం చేస్తూ గ్యారంటీ రోజగార్, అజీవిక మిషన్ (గ్రామీణ) బిల్లు తెచ్చారని తెలిపారు. కొత్త చట్టం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగు పరిచే చర్యలు ఏమిటి? అని ప్రశ్నించారు. ఈ కొత్త బిల్లు ఉన్న ఉపాధిని లేకుండా చేస్తోందని, పని దినాలు 125 రోజులకు పెంచుతున్నట్టు చెప్పి 60 రోజులు పని నిషేధం విధించారని, వ్యవసాయ సీజన్‌లో రైతులకు కూలీల కొరత లేకుండా అని రైతుల ముసుగు తగిలించారని విమర్శించారు.

ఇప్పటి వరకు 90శాతం ఉపాధి హామీ పనుల నిధులు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం పది శాతం వాటా ఉండేదని, ఇప్పుడు 40 శాతం వాటా రాష్ట్రాలు ఇవ్వాలని చెప్పటం వెనుక ఈ చట్టాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసే కుట్రలో భాగమేనని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన వేతనాల కంటే రాష్ట్రాల్లో ఎక్కువ వేతనాలు ఉంటే అవే కనీస వేతనాలుగా ఉండాలని, కానీ ఇప్పుడు ఉన్న దానిని కొత్త బిల్లులో రద్దు చేశారని, ద్రవ్యోల్బణం ఆధారంగా వేతనాలు పెరగాలని ఉన్న నిబంధన తొలిగించారని వివరించారు. ఆధార్ నిబంధన అమలు చేయడం లేదని సుప్రీం కోర్టుకు స్పష్టం చేసి.. మరోవైపు ఇప్పటికే ఉపాధికి ఆధార్ లింక్, కొలతలతో వేతనాలు ఇస్తూ రెండు పూటల హాజరు, కేవైసీ పెట్టారని తెలిపారు. దీనిపై ఆందోళన చేస్తుంటే ఇప్పుడు బయోమెట్రిక్, జీపీఎస్‌ను చట్ట బద్ధం చేయడమంటే పేదలను ఉపాధి హామీ నుంచి తొలగించడం తప్ప మరొకటి కాదని విమర్శించారు. గ్రామాల్లో పడిపోతున్న ఉపాధి పని దినాల వల్ల పేదలు బతక లేరన్నారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టమే ఉండాలని, 2025 కొత్త బిల్లు వద్దని అన్నారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి నారి ఐలయ్య, భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నరసింహ, సూర్యాపేట జిల్లా అధ్యక్షులు ములకలపల్లి రాములు, మహిళా కూలీల జిల్లా కన్వీనర్ దండెంపల్లి సరోజ, సిఐటియు జిల్లా అధ్యక్షులు చిన్నపాక లక్ష్మీనారాయణ, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, మండల కన్వీనర్ పోలె సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

వంతెన పైనుంచి కారు బోల్తా..

- నలుగురు మృతి.. ఐదుగురికి గాయాలు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహారాష్ట్రలోని లక్కడికోట-దేవాడ మధ్యలో వంతెనపై బుధవారం రాత్రి కారు అదుపు తప్పి ఒర్రెలో పడిపోవటంతో అందులో ప్రయాణిస్తున్న నలుగురు అక్కడికక్కడే మృతిచెందారు. మృతులు కుమురం భీం- ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని ఒకే కుటుంబానికి చెందినవారు. వివరాలిలా ఉన్నాయి.. కాగజ్‌నగర్‌కు చెందిన అఫ్జల్ బేగం (52), సహేరాబేగం (45), అసెర షెబ్రీం (13), సల్మాబేగం (39), నజత్ బేగం, నస్రూత్ బేగం, అబ్దుల్ రహెమాన్, షాహిన్ నిషా, అబ్దుల్ అర్మన్ నాగ్‌పూర్‌లో నివాసం ఉంటున్న బంధువు అప్సరి బేగం కుటుంబ సభ్యులను కలిసేందుకు బుధవారం ఉదయం ఎనిమిది గంటలకు కారులో బయలుదేరారు. సాయంత్రం తిరుగు ప్రయాణంలో రాత్రి ఒంటి గంటకు లక్కడి కోట-దేవాడ మధ్యలో వంతెన సమీపంలోకి రాగానే ఒక్కసారిగా వాహనం అదుపు తప్పి వంతెనపై నుంచి నేరుగా ఒర్రెలో బోల్తా పడింది. కారు నడుపుతున్న అబ్దుల్ రహెమాన్ బయటకు వచ్చి కేకలు వేయటంతో పక్కనే రోడ్డు నిర్మాణ కూలీలు సంఘటన స్థలానికి వచ్చి కారులోంచి అందరినీ బయటకు తీశారు. 20అడుగుల పై నుంచి పడి పోవటంతో అఫ్జల్ బేగం, సహేరాబేగం, అసెర షెబ్రీం, సల్మాబేగం అక్కడికక్కడే మృతి చెందారు. నజత్ బేగం, నుస్రత్ బేగంను చంద్రాపూర్ ఆస్పత్రికి తరలించారు. వీరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు డాక్టర్ తెలిపారు. రహెమాన్‌తోపాటు మరో ఇద్దరు కూడా గాయపడ్డారు. ఘటనపై వెంటనే రహెమాన్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించటంతో కాగజ్‌నగర్ నుంచి రాత్రికి రాత్రే బంధువులు బయలుదేరి వెళ్లారు. గురువారం సాయంత్రం నాలుగు గంటల వరకు పోస్టుమార్టం చేసి మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. అంతా ఒకే కుటుంబం కావడంతో స్థానికంగా తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

నల్లగొండ బిజెపిలో ముష్టి యుద్ధం

- బిసి నేత పిల్లి రామరాజుపై నాగం అనుచరుని దాడి
- క్షమాపణ చెప్పాలని ఆఫీస్ ఎదుట బాధితుని అనుచరుల ఆందోళన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నల్లగొండ బిజెపిలో ముష్టి యుద్ధం జరిగింది. వాజ్‌పేయి జయంతి వేడుకల్లో బిసి నాయకులు పిల్లి రామరాజు యాదవ్‌పై జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్‌రెడ్డి అనుచరుడు భౌతిక దాడి చేశాడు. దాంతో నాగం వర్షిత్‌రెడ్డి దౌర్జన్యం నశించాలంటూ కార్యాలయం ఎదుట రామరాజు యాదవ్, ఆయన అనుచరులు ఆందోళన చేపట్టారు. ఇదే సమయంలో న్యూస్ కవరేజ్ కోసం వెళ్లిన ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు కెమెరాలను నాగం లాక్కొని చిప్‌ను ఫార్మాట్ చేశాడు. దీంతో విలేకరులంతా ఆందోళన చేపట్టారు. ఈ ఘటన గురువారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని బిజెపి కార్యాలయంలో జరిగింది.

బిజెపి నల్లగొండ జిల్లా కార్యాలయంలో గురువారం మాజీ ప్రధాని వాజ్‌పేయి జయంతి వేడుకలు నిర్వహించారు. బిజెపి తరఫున గెలిచిన సర్పంచ్, ఉప సర్పంచ్ అభ్యర్థులకు వాజ్‌పేయి జయంతి సందర్భంగా పార్టీ జిల్లా కార్యాలయంలో సన్మాన కార్యక్రమం నిర్వహించాలని జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి అనుమతి తీసుకొని పిల్లి రామరాజు యాదవ్ ఏర్పాట్లు చేశారు. బుధవారం అర్ధరాత్రి ఫోన్ చేసి సన్మాన కార్యక్రమాన్ని రద్దు చేయాలని నాగం ఆదేశించారని రామరాజు తెలిపారు. గురువారం ఉదయం వాజ్‌పేయి జయంతి వేడుకల సమయంలో నాగం వర్షిత్‌రెడ్డి సర్పంచులకు సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పాడని రామరాజు చెబుతున్నారు. తనను నిర్వహించొద్దని చెప్పి.. ఇప్పుడు ఎలా చేస్తారని ప్రశ్నించడంతో నాగం వర్షిత్‌రెడ్డి, రామరాజు మధ్య వాగ్వాదం జరిగింది. మరోవైపు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధి ఈ గొడవను రికార్డు చేయగా.. నాగం వర్షిత్ రెడ్డి మీడియా ప్రతినిధి కెమెరాను గుంజుకొని చిప్‌ను ఫార్మాట్ చేశాడు. దీంతో జర్నలిస్టులు తమపై జరిగిన దాడిని నిరసిస్తూ బిజెపి కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఒంటెద్దు పోకడలతో పార్టీ కోసం కష్టపడే వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నాడని రామరాజుఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో టికెట్ కోసం తనకు ఎవరూ పోటీ ఉండొద్దన్న ఆలోచనతో బలమైన పార్టీ నాయకులను ఉద్దేశపూర్వకంగా వర్షిత్ రెడ్డి దూరం పెడుతున్నారని అన్నారు. తనపై దాడి చేసిన మోహన్ రెడ్డి పార్టీ నాయకుల సమక్షంలో తనకు క్షమాపణ చెప్పే వరకు ఆందోళన విరమించేది లేదని రామరాజు, ఆయన అనుచరులు భీష్మించుకూర్చున్నారు. మరోవైపు పార్టీ కార్యాలయం ఎదుట విలేకరులు ఆందోళన చేపట్టడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. నాగం వర్షిత్‌రెడ్డి జర్నలిస్టులకు క్షమాపణ చెప్పడంతో విలేకరులు ఆందోళన విరమించారు.



విద్యాశాఖ మంత్రిగా రేవంత్ ఉన్నా.. అనాథ పిల్లలకు అన్నం పెట్టడం లేదు : హరీశ్‌రావు విమర్శ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యాశాఖ మంత్రిగా సీఎం రేవంత్‌రెడ్డి ఉండి కూడా.. అనాథ పిల్లలకు అన్నం పెట్టడం లేదని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. గురువారం సిద్దిపేట పట్టణంలోని నాసార్‌పుర ఫిల్టర్ బెడ్ వద్దనున్న అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌లో హరీశ్‌రావు బ్లాంకెట్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పెట్టే గుడ్లు, బియ్యంను ఎమ్మెల్యే పరిశీలించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పిల్లలు చలితో చాలా ఇబ్బందులు పడుతుంటే బ్లాంకెట్స్ పంపిణీ చేశామని అన్నారు. రేవంత్ రెడ్డి మళ్లీ గెలుస్తా అని శపథాలు చేస్తున్నారని.. కమీషన్లు కొట్టుడు, చిల్లర మాటలు మాట్లాడటం, పార్టీలు మారడం, సీట్లు కొనడం రేవంత్‌కి అలవాటంటూ విమర్శించారు. ఫార్మాసిటీని తాము ఏర్పాటు చేస్తే.. దాన్ని ఖండించి.. రియల్ ఎస్టేట్ వ్యాపారంగా మలిచాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిల్లర మాటలు మాని, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలంటూ వ్యాఖ్యానించారు.

సోయా కొనుగోళ్లకు బ్రేక్

- రంగు మారిందనే సాకుతో కొనేందుకు ముందుకురాని ప్రభుత్వరంగ సంస్థలు
- ఇళ్లల్లో పేరుకుపోయిన నిల్వలు
- ఆందోళనకు పిలుపునిచ్చిన అఖిలపక్షం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించక రైతులు నష్టపోతుంటే ఈ యేడు అధిక వర్షాలు పంటలను ముంచెత్తాయి. ఇప్పటికే నష్టాల్లో ఉన్న సోయా రైతుల పరిస్థితి మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టు అయింది. నష్టపోయి ఇబ్బందుల్లో ఉన్న రైతులకు ఎంతో కొంత చేతికందిన పంటను విక్రయించే వీలు లేకుండా పోయింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థలు కొనుగోళ్లకు ముందుకు రావడం లేదు. అధిక వర్షాలతో సోయా పంట తడిసి రంగు మారిదంటూ కొనుగోలు చేయడం లేదు. పంట కొనుగోలు చేయబోమని మార్కెట్‌కు వచ్చిన రైతులను తిప్పి పంపించారు. నలుపు రంగు వచ్చిందని, తెలుపు రంగులో ఉంటేనే కొనుగోలు చేస్తామని ప్రభుత్వరంగ సంస్థలు కొర్రీలు పెట్టడంతో సోయా రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది.

ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా నాఫెడ్, మార్క్‌ఫెడ్ సంస్థలు సోయా కొనుగోళ్లు నిలిపేశాయి. దీంతో రైతులు పండించిన పంట ఇండ్లలోనే మగ్గుతోంది. సోయా కొనుగోళు చేపట్టాలని రైతులు ఆందోళనలు చేపడుతున్నారు. ఈ విషయంలో అఖిలపక్షం ఆధ్వర్యంలో రైతు సంఘాలు ఆందోళనకు సిద్ధమవుతున్నాయి. బుధవారం అఖిలపక్ష రైతు సంఘాలు రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించి ఆందోళన కార్యక్రమాలు చేపట్టేందుకు తీర్మానించాయి. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి వస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతి పత్రాలు ఇవ్వనున్నారు. అదే విధంగా సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి జిల్లాలో సోయా కొనుగోళ్లు ప్రారంభించాలని కోరనున్నట్టు రైతు సంఘాల నాయకులు తెలిపారు.



30శాతం కూడా పూర్తికాని కొనుగోళ్లు

జిల్లాలో సోయా సాగు విస్తీర్ణానికి తగ్గట్టు పంట కొనుగోళ్లు జరగలేదు. నాఫెడ్ ద్వారా సోయా పంటకు క్వింటాల్ మద్దతు ధర రూ.5328 ఇస్తున్నారు. ఇప్పటి వరకు నాఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన సోయాబీన్ పంట 30 శాతం మాత్రమేనని రైతులు తెలిపారు. కొనుగోళ్లు ఆలస్యంగా ప్రారంభించడంతో మార్కెట్ యార్డులో ఆరబెట్టుకున్న సోయా పంట మొంథా తుఫాన్‌తో పూర్తిగా తడిసిపోయి రంగు మారింది. ప్రకృతి వైపరీత్యానికి రైతులు నష్టపోతే రంగు మారిన పంటను కొనుగోలు చేయబోమని ప్రభుత్వరంగ సంస్థలు వెనుకడుగు వేశారు.

రైతుల వద్దే సుమారు నాలుగు లక్షల క్వింటాళ్లు

జిల్లాలో ఈ ఖరీఫ్‌లో 60వేల ఎకరాల్లో సోయా పంట సాగైనట్టు వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ఎకరాకు సుమారు 7 నుంచి 12 క్వింటళ్ల సోయా వస్తుందని అంచనా. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా సోయా దిగుబడులు 4.50లక్షల క్వింటాళ్ల నుంచి 7.20 క్వింటాళ్ల వరకు వచ్చే అవకాశముంది. అయితే, ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 1.64లక్షల క్వింటాళు మాత్రమే కొనుగోలు చేసినట్టు అధికారులు లెక్కలు చూపుతున్నారు.

35 క్వింటాళ్లు ఇంట్లోనే ఉంచా.. రైతు నిమ్మల సుదర్శన్‌రెడ్డి, రుయ్యాడి, తలమడుగు మండలం

అమ్మడానికి మార్కెట్ యార్డుకు పోతే తేమ శాతం 12 వచ్చింది కానీ నల్లబడ్డాయని కొనుగోలు చేయబోమని తిప్పి పంపించారు. ఐదెకరాల్లో సోయా సాగు చేశాను. చివరికి మిగిలిన దిగుబడిని విక్రయించేందుకు వెళ్తే కొనుగోళ్లు నిలిపేశారు. రుయ్యాడి గ్రామంలోనే వందల క్వింటాళ్ల సోయా పంట నిల్వ ఉంది. ప్రభుత్వం వెంటనే సోయా కొనుగోళ్లు ప్రారంభించి రైతులను ఆదుకోవాలి.

రంగు మారిందనే సాకుతో ఆపేశారు : గోడే విశాల్, రైతు, బేల

ఈ నెల 20న 35 క్వింటాళ్ల సోయాను బేల మార్కెట్ యార్డుకు తీసుకొచ్చాను. రంగు మారిందనే సాకుతో కొనుగోలు చేయడం లేదు. తేమ శాతం అధికంగా ఉందని కోనుగోళ్లు ఆపేశారు. రోజూ పంటను ఆరబెడుతూ మార్కెట్‌లోనే ఉంటున్నాను. నాణ్యత లేదని మొత్తానికే కొనుగోళ్లు ఆపకుండా మద్దతు ధర కొంత తగ్గించైనా వెంటనే కోనుగోలు చేయాలి. ఏ-గ్రేడ్, బి-గ్రేడ్‌గా పరిగణించి రైతులకు నష్టం జరగకుండా ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలి.

తల్లీ కొడుకు దారుణ హత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తల్లీ, కొడుకు దారుణ హత్యకు గురైన ఘటన సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మున్సిపాల్టీలోని జిపి కాలనీలో గురువారం జరిగింది. మరోవ్యక్తి కత్తిపోటుకు తీవ్రంగా గాయపడ్డారు. ఈ హత్యలకు వివాహేతర సంబంధమే కారణమని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నార్సింగ్ ప్రాంతానికి చెందిన శివరాజు క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతడికి వనపర్తి జిల్లా అమరచింతకు చెందిన చంద్రకళ (30)తో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ క్రమంలో చంద్రకళ, ఆమె కుమారుడు రేవంత్ కుమార్(15)తో కలిసి శివరాజు.. నాలుగు రోజుల క్రితం తెల్లాపూర్‌లోని జెపి కాలనీలో ఓ ఇంట్లో అద్దెకు దిగారు. గురువారం మధ్యాహ్నం అద్దె ఇంట్లో చంద్రకళ, రేవంత్‌కుమార్, శివరాజు రక్తపు మడుగులో ఉండడాన్ని స్థానికులు గమనించారు. పోలీసులకు సమాచారం అందించారు. తల్లీ కొడుకు అక్కడికక్కడే మృతి చెందారు.
తీవ్ర గాయాలతో ఉన్న శివరాజును దగ్గరలో ఉన్న ఆస్పత్రికి తరలించారు. అడిషనల్ డిసిపి ఉదయ్ రెడ్డి, ఎసిపి శ్రీనివాస్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని..
హత్య జరిగిన తీరును పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. సంఘటనా స్థలానికి క్లూస్ టీమ్, ఫింగర్ ప్రింట్ టీమ్ పోలీసులు చేరుకొని క్షుణ్ణంగా పరిశీలించారు.

గొంతు కోసి యువకుడి దారుణ హత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గుర్తు తెలియని వ్యక్తుల చేతిలో యువకుడు దారుణ హత్యకు గురైన ఘటన రంగారెడ్డి జిల్లా శంషాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కవేలిగూడ గ్రామంలో గురువారం జరిగింది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం పాత కక్షల నేపథ్యంలో హత్య జరిగి ఉండొచ్చని పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్ కె.నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్ మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన జంపుల మహేశ్ కుమార్ (24).. శంషాబాద్ మండలం కావేలిగూడ గ్రామంలోని జై భవాని బార్బర్ షాప్‌లో బార్బర్‌గా పని చేస్తున్నారు. ఇతనికి తల్లి యాదమ్మ, తమ్ముడు ఉదయ్ ఉన్నారు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి తొమ్మిది అయినప్పటికీ ఇంటికి వెళ్లలేదు. అతని తల్లి ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయలేదు. ఈ క్రమంలో.. కావేలిగూడ గ్రామం వెంచర్‌లో ఓ వ్యక్తి చనిపోయి ఉన్నాడని రాజేందర్‌రెడ్డి అనే వ్యక్తి గురువారం ఉదయం పోలీసులకు సమాచారం ఇచ్చారు. దాంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తులు మహేశ్ మెడను అత్యంత దారుణంగా కోసి చంపినట్టు గుర్తించారు. నాలుగు కోడిగుడ్లలో ఉన్న నీలాన్ని బయట పడేసి అందులో మిరపకారం పొడి నింపి స్టిక్కర్ అంటించారు. అతను పారిపోకుండా కళ్లల్లో కారం కొట్టి చంపాలనే ఉద్దేశంతో ఇలా చేసినట్టు అక్కడ ఆధారాలు లభ్యమయ్యాయి. ఈ హత్యతో వెంకటాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులపై అనుమానం ఉన్నట్టు మృతుని తల్లి యాదమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివాహేతర సంబంధమే హత్యకు కారణమై ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఆరు నెలల క్రితం మృతుని ఇంటి ఎదుట ఉన్న బైక్‌ను సైతం గుర్తుతెలియని వ్యక్తులు కాల్చేశారు. వారం రోజుల నుంచి అతన్ని చంపేస్తామని బెదిరింపులు కూడా వచ్చాయని కుటుంబ సభ్యులు తెలిపారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్ నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులతో పాటు స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.